ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 30-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గిరిజన యువత సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుతూ ఆధునిక అభివృద్ధి మార్గంలో వేగంగా ముందుకు సాగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.
- ❖ సంస్కరణలతో భారత్ సాధించిన వేగవంతమైన పురోగతిని యావత్ ప్రపంచం అభినందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వీబీ-జీ-రామ్-జీ పథకాన్ని తీర్చిదిద్దామని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.
- ❖ సరిహద్దు చొరబాట్లను నియంత్రించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గిరిజన యువత సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుతూ ఆధునిక అభివృద్ధి మార్గంలో వేగంగా ముందుకు సాగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. జార్ఖండ్‌లోని గుమ్లాలో ఈరోజు జరిగిన అంతర్రాజ్య జనసాంస్కృతిక సమాగమ్ సమారోహ్ కార్తీక్ జాతర సమాపనోత్సవంలో రాష్ట్రపతి పాల్గొని ప్రసంగిస్తూ... భగవాన్ బిర్సా ముండా జన్మస్థలం అయిన జార్ఖండ్‌ను సందర్శించడం ఒక తీర్థయాత్ర లాంటిదన్నారు. సామాజిక న్యాయం, గిరిజన గర్వానికి బిర్సా ముండా గొప్ప చిహ్నం అని అన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం అవిరళ సేవలు అందించిన బాబా కార్తీక్ ఓరన్ చిరస్మణీయులని అన్నారు. గిరిజన మ్యూజియంల ఏర్పాటు ద్వారా వారి వీరోచిత గాథలను ప్రజలకు పరిచయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ద్రౌపది ముర్ము పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం సంస్కరణల శిఖరాగ్రాన్ని అధిరోహించి ప్రపంచానికి కేంద్రంగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సంస్కరణలతో వేగవంతమైన దేశ పురోగతిని ప్రపంచం అభినందిస్తుందని సామాజిక మాధ్యమంలో ప్రధానమంత్రి పేర్కొన్నారు. నేడు ప్రపంచం భారతదేశాన్ని ఆశతో, నమ్మకంతో చూస్తుందని ప్రధానమంత్రి తెలిపారు. భారతదేశానికి 2025 సంస్కరణల సంవత్సరంగా గుర్తుండిపోతుందని, వివిధ రంగాలలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని, ఇవి దేశ అభివృద్ధి ప్రయాణానికి ఊతం ఇచ్చాయన్నారు. ప్రభుత్వం సంస్థలను ఆధునికీకరించిందని, పాలనను సరళీకృతం చేసి దీర్ఘకాలిక, సమ్మిళిత వృద్ధికి పునాదులను బలోపేతం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక చట్టాలు, వాణిజ్య ఒప్పందాల నుండి లాజిస్టిక్స్, ఇంధనం, మార్కెట్ వంటి ఎన్నో సంస్కరణలు దేశవృద్ధి, స్థిరత్వాన్ని పెంపొందిస్తాయని, అలాగే 2047 వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఎంతగానో దోహదపడతాయని నరేంద్ర మోదీ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ - 2047 లక్ష్యాలకు అనుగుణంగా వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ జీ-రామ్-జీ) పథకాన్ని తీర్చిదిద్దామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. భోపాల్‌లో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని.. మునుపటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, (MGNREGA) పథకంలోని లోపాలను సవరించే లక్ష్యంతో పార్లమెంట్ వీబీ జీ-రామ్-జీ బిల్లును ఆమోదించిందన్నారు. ఈ పథకాన్ని ప్రధానమంత్రి గతి శక్తి చొరవతో అనుసంధానించామని, దీనిని మరింత ప్రభావవంతంగా మార్చామని శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈ మిషన్‌లో నిరుద్యోగ భృతికి సంబంధించి స్పష్టమైన నిబంధన ఉందని, చట్టం ప్రకారం అవసరమైన ఆర్థిక ఏర్పాట్లు నిర్ధారించబడ్డాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ హెలికాప్టర్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఈరోజు ధృవ ఎన్జీ సివిల్ వేరియంట్ హెలికాప్టర్ ను ప్రారంభించారు. ఈ హెలిక్యాప్టర్ లోని దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన శక్తి ఇంజిన్‌కు పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ ధృవీకరణ పత్రం లభించింది. హెచ్ ఏ ఎల్ పౌర విమానయాన రంగంలో ప్రవేశిస్తున్న ఈ తరుణం ప్రత్యేకమైనదని కేంద్రమంత్రి ఈ సందర్భంగా అన్నారు. పౌర విమానయాన రంగంలో ఆత్మ నిర్భరతకు ఈ ధ్రువ హెలికాప్టర్ పెద్ద ఊతమిస్తుందని పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ లో త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. కోల్‌కతాలో ఈరోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చొరబాట్లను ఆపడం, చొరబాటుదారులను నిలువరించడం అనే అంశాలపై వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని అన్నారు. బెంగాల్ సరిహద్దు నుంచి జరుగుతున్న చొరబాట్లు జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నాయని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి ప్రాజెక్టులలో నాణ్యతను బలోపేతం చేయడానికి నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) నేషనల్ టెస్ట్ హౌస్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. న్యూఢిల్లీలోని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. నిర్మాణ సామగ్రి, భాగాలు, వ్యవస్థలను స్వతంత్రంగా పరిశీలించి తద్వారా నాణ్యత హామీ, నియంత్రణ విధానాలను బలోపేతం చేయడం ఈ ఒప్పందం లక్ష్యం అని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాలనా సంస్కరణల సంవత్సరంగా 2025 నిలుస్తుందని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన సంవత్సరాంతపు విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. పీఎం రోజ్‌గార్ మేళా, కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పర్యవేక్షణ వ్యవస్థతో సహా వివిధ శాఖల కీలక కార్యక్రమాలు ఈ ఏడాది మైలురాళ్లను దాటాయని జితేంద్ర సింగ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, శ్రీలంక మహిళా జట్ల మధ్య టీ-20 సిరీస్ లో భాగంగా తిరువునంతపురం వేదికగా ఐదవ టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్.. శ్రీలంకకు 176 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 68 పరుగులతో రాణించింది. ఇప్పటికే వరుసగా 4 మ్యాచ్‌లు గెలిచిన భారత మహిళల జట్టు శ్రీలంకను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో పోటీకి దిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హర్యానా, చండీగఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలలో ఈరోజు, రేపు దట్టమైన పొగమంచు పరిస్థితులు ఉంటాయని భారత వాతావరణ విభాగం (IMD) పేర్కొంది. ఢిల్లీ, జార్ఖండ్, అరుణాచల్ ప్రదేశ్‌లలో కూడా ఇవే పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది. పంజాబ్, హర్యానా, చండీగఢ్, పశ్చిమ మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లో చలిగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84 వేల 695 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 20 పాయింట్ల నష్టంతో 84 వేల 675 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 3 పాయింట్లు నష్టపోయి 25 వేల 938 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 89 రూపాయల 84 పైసలుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్ లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.59 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 390 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =